ముఖ్యమంత్రిని కలిసిన జానారెడ్డి

## మావోయిస్టులతో చర్చలకు కమిటీ ఏర్పాటు

- మాజీ మంత్రి జానారెడ్డితో సిఎం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. దానిలో భాగంగా మాజీ హోంశాఖ మంత్రి కె జానారెడ్డితో ఆయన భేటీ అయ్యారు. సోమవారంనాడాయన మాజీ మంత్రి జానారెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయన వెంట ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు కూడా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలో నక్సలైట్లతో శాంతి చర్చలు జరిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలో జానారెడ్డి హోంమంత్రిగా ఉన్నారు. చర్చల ప్రక్రియలో కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఆయన అనుభవాలు తెలుసుకోవడంతో పాటు, ఇప్పుడు ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యాచరణ పైనా చర్చించారు. దానికంటే ముందు కాంగ్రెస్‌పార్టీతో చర్చించాల్సి ఉందని సీఎం చెప్పారు. ఈ బాధ్యతను సీనియర్ నాయకులు జానారెడ్డి, కే కేశవరావు చేపడతారని తెలిపారు. ఆదివారం శాంతి చర్చల కమిటీ ప్రతినిధులు జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, దుర్గా ప్రసాద్, జంపన్న, రవిచందర్ తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. తమ ప్రభుత్వం దీన్ని సామాజిక సమస్యగా చూస్తుందే తప్ప, శాంతి భద్రతల సమస్యగా చూడబోదని సిఎం వారికి స్పష్టంగా చెప్పారు. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి జానారెడ్డితో సీఎం భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర భద్రతా బలగాలు కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం జల్లెడ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారితో శాంతి చర్చలు జరపాలని పౌరసంఘాలు, వామపక్ష రాజకీయపార్టీలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

## నేటి నుంచి ఎప్‌సెట్ ఎగ్జామ్స్

- రెండ్రోజులు అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌కు
- మే 2 నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు పరీక్షలు
- 3,06,796 మంది దరఖాస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టిజి ఎప్‌సెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా టిజి ఇఎపిసెట్‌కు 3,06,796 దరఖాస్తులు వచ్చాయి. ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో 2,20,049, అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్‌లో 86,493, రెండింటికీ 254 అప్లికేషన్లు వచ్చాయి. ఈ నెల 29, 30వ తేదీల్లో జరిగే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ ఎగ్జామ్ కోసం 112 సెంటర్లు ఏర్పాటు చేశారు. మే 2 నుంచి 4 వరకు జరిగే ఇంజినీరింగ్ స్ట్రీమ్ కోసం 124 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఎప్‌సెట్ ఎగ్జామ్స్ ప్రతి రోజూ 2 సెషన్లలో నిర్వహించనున్నారు. మార్నింగ్ సెషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షలకు ఎప్‌సెట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే దాదాపు అభ్యర్థులంతా వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. తొలిసారిగా ఎప్‌సెట్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దాని ద్వారా ఎగ్జామ్ సెంటర్ రూట్ మ్యాప్ సులభంగా తెలుసుకోవచ్చు.

**అమల్లో నిమిషం నిబంధన**

ఎప్‌సెట్ పరీక్షలకు నిమిషం నిబంధన అమలు చేయనున్నారు. మార్నింగ్ సెషన్ ఎగ్జామ్‌కు ఉదయం 7.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ వారికి 1.30 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. బయోమెట్రిక్ తప్పనిసరి ఉండడంతో అభ్యర్థుల వేలిముద్రలను తీసుకుంటారు. చేతులపై మెహందీ, టాటూ, ఇంక్ మొదలైన డిజైన్లు ఉండకూడదు. ఫొటో ఐడీ, హాల్‌టికెట్, బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ను తీసుకెళ్లాలి.

## లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

- ప్రమాణం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా జస్టిస్ జగ్జీవన్ కుమార్ సోమవారం పదవిబాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోలని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. కాగా లోకాయుక్తగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, ఉప లోకాయుక్తగా జస్టిస్ జగ్జీవన్ కుమార్ ఆయా పదవుల్లో ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు.

## లండన్‌లో తప్పిపోయిన నిజామాబాద్ జిల్లా విద్యార్థి

- స్పందించిన సిఎంఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లండన్‌లో తప్పిపోయిన ఒక విద్యార్థికి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. అక్కడ తప్పిపోయిన తన కుమారుడు నల్ల అనురాగ్ రెడ్డి జాడ వెతికి తెలుసుకుని ఇండియాకు రప్పించాలని అతడి తల్లి హరిత సీఎం రేవంత్ రెడ్డికి, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ అనిల్ ఈరవత్రికి సోమవారం వినతిపత్రం పంపారు. వెంటనే స్పందించిన అనిల్ సిఎంఒ, జిఎడి ఎన్నారై అధికారులతో మాట్లాడారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఢిల్లీలోని విదేశాంగ శాఖకు, లండన్ లోని ఇండియన్ హై కమీషన్ కు లేఖలు రాశారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన అనురాగ్ విద్యార్థి వీసాపై జనవరిలో లండన్‌కు వెళ్ళాడు. యూకే లోని కార్డిఫ్ ప్రాంతంలో ఈనెల 25న సాయంత్రం నుంచి తన కుమారుడు జాడ తెలియకుండా పోయాడని హరిత తన వినతిపత్రం లో తెలిపారు.

## వోక్సెన్ విశ్వవిద్యాలయం 'డిజైన్ వాన్‌గార్డ్' వేడుక

ప్రజాశక్తి - హైదరాబాద్

వోక్సెన్ విశ్వవిద్యాలయంలో ఔత్సాహిక డిజైనర్ల సృజనాత్మక ప్రతిభను వేడుక జరుపుకోవడానికి విద్యార్థులు, డిజైన్ ఔత్సాహికులను ఒకచోట చేర్చి డిజైన్ వాన్‌గార్డ్ 2025 నిర్వహించింది. మాదాపూర్‌లోని టి వర్క్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో "టుమారో బై డిజైన్: నర్చరింగ్ ఫ్యూచర్ క్రియేటర్స్" అనే నేపథ్యంపై ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మింత్రా డిజైన్ హెడ్ షయక్ సేన్, హైదరాబాద్‌లోని బిఐఎస్ హెడ్ పి. వెంకట్ శ్రీకాంత్, డిఆర్‌డిఒ డైరెక్టర్ వీర బ్రహ్మం హాజరై ఔత్సాహికవేత్తలను ఉత్సాహపరిచారు.

## ఎన్‌జిఓలకు హెచ్‌సిఎల్ ఫౌండేషన్ రూ.16.5 కోట్ల సాయం..!

ప్రజాశక్తి - హైదరాబాద్

హెచ్‌సిఎల్ టెక్‌కు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యలను అమలు చేసే హెచ్‌సిఎల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలకు భారీ సాయాన్ని ప్రకటించింది. పలు ఎన్‌జిఓలకు 2025 హెచ్‌సిఎల్ టెక్ గ్రాంట్ కింద రూ.16.5 కోట్లు అందించనుంది. ఈ ఎడిషన్‌కు ఎన్‌జిఓల నుంచి 13,925 దరఖాస్తులు రాగా.. ఇందులో పలు ప్రభావితమైన ప్రాజెక్టులకు నిధులు ఇవ్వడానికి విజేతలను ఎంపిక చేసినట్లు ఆ సంస్థ తెలిపింది.

# ప్రజా సమస్యలపై భారీ ర్యాలీ

- వందలాది మందితో కలెక్టరేట్ వరకు సిపిఎం ప్రదర్శన, మహాధర్నా
- ప్రజలను పోరాటమార్గాన నడిపించేది ఎర్రజెండానే..
- సీనియర్ నాయకులు చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాసమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనం నుంచి వందలాది మందితో ప్రారంభమైన పాదయాత్ర జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఐదు కిలోమీటర్లు ర్యాలీగా వెళ్లింది. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ అధ్యక్షతన జరిగిన మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేసేది.. ప్రజలను పోరాటాల్లో పాల్గొనేలా చైతన్యం చేసేది ఒక్క ఎర్రజెండానే అని అన్నారు. గతంలో బిఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో అనేక హామీలు ఇచ్చి సక్రమంగా అమలు చేయక ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ రావాల్సిన వాటాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పహల్గాంలో జరిగిన దాడి కేంద్ర ప్రభుత్వ రక్షణ విభాగానికి సంబంధించిన నిర్లక్ష్యం తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మర్చిపోయిందని విమర్శించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లా రైతాంగానికి సాగునీరు అందించే చిన్న నీటి ప్రాజెక్టులు బస్వాపూర్ రిజర్వాయర్, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని, గంధమల్ల, శివన్నగూడెం రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం కరువైందని, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేక, అందుబాటులో ఉన్న ఎయిమ్స్‌లో పూర్తిస్థాయి వైద్యం అందక గాంధీ, ఉస్మానియాలాంటి ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు నిర్ణయించిన వారికి కాకుండా గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, జెల్లెల పెంటయ్య, గుంటోజు శ్రీనివాసాచారి, జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మాయ కృష్ణ, సిర్పంగి స్వామి, బొడ్డుపల్లి వెంకటేశం, ఎండి పాషా, బొల్లు యాదగిరి, గంగదేవి సైదులు,మద్దెల రాజయ్య, గడ్డం వెంకటేష్, ఎంఎ ఇక్బాల్, వనం ఉపేందర్, కోట రామచంద్రారెడ్డి, రాగీరు కిష్టయ్య, బల్గురి అంజయ్య, గోశిక కరుణాకర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, దొంతగాని పెద్దలు, ధోనూరి నర్సిరెడ్డి, మంగ నరసింహులు, కళ్లెం సుదర్శన్ రెడ్డి, మండల కార్యదర్శులు దూపటి వెంకటేష్, పల్లెర్ల అంజయ్య, గాడి శ్రీనివాస్, పోతరాజు జహంగీర్, ర్యకాల శ్రీశైలం, కొల్లూరి ఆంజనేయులు, మునుకుంట్ల లెనిన్, దుబ్బాక జగన్, ప్రజాసంఘాల నాయకులు ఈర్లపల్లి ముత్యాలు, పల్లె మధుకృష్ణ, వడ్డేబోయిన వెంకటేష్, కవిడే సురేష్, వనం రాజు, లావుడియా రాజు, గంటెపాక శివ పాల్గొన్నారు.

## 8 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

- పెండింగ్ సమస్యల్ని పరిష్కరించాలి
- ఐటి ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు మీ సేవా ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీ సేవా ఉద్యోగులకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను చెల్లించాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మీ సేవ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.సురేశ్, జెనీమా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యల్ని ఆయన దృష్టికి వెంకటేశ్ తీసుకెళ్లారు. కనీస వేతనాలను పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వెంటనే పెంచాలని విజ్ఞప్తి చేశారు. వార్షిక బోనస్, ఇన్సెంటివ్‌లను ప్రతి ఏటా చెల్లించాలని కోరారు. మీసేవా కేంద్రాల్లో ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరుగుతున్న నేపథ్యంలో అదనపు సిబ్బందిని నియమించాలని విన్నవించారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ స్కీమ్ వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మీ సేవా కేంద్రాల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు.

## భూ భారతి చట్టం చారిత్రాత్మకం

రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సదస్సులో మాట్లాడుతున్న నవీన్ మిట్టల్

భూభారతి చట్టం చారిత్రాత్మకమని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సిసిఎల్ కార్యాయంలో భూ భారతిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఉద్యోగులకు ఆయన దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకొచ్చిన కొత్త చట్టంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని స్థాయిల రెవెన్యూ ఉద్యోగులు భూ భారతి చట్టాన్ని నిబద్ధతతో అమలు చేయాలని సూచించారు. తమ స్థాయిలో లేని సమస్యలుంటే ప్రజలకు అవగాహన కల్పించాలే తప్ప, వారిని ఆఫీసుల చుట్టు తిప్పించుకోవద్దని పేర్కొన్నారు. అప్పుడే ఉద్యోగులతో పాటు సర్కార్‌కు మంచి పేరొస్తుందని అభిప్రాయపడ్డారు. నవీన్‌మిట్టల్‌తో పాటు సీసీఎల్‌ఏ సెక్రటరీ మంద మకరందును తెలంగాణ ఉద్యోగుల జెఏసి చైర్మన్ వి లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిజిఆర్‌ఎస్ఎ కోశాధికారి మల్లేశ్, సిసిఎల్ఏ విభాగం అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి కృష్ణ చైతన్య, కార్యవర్గ సభ్యులు డి శ్రీకాంత్ రెడ్డి, కె మంజుల, ఎం సాయికృష్ణ, పి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

# శక్తి మనదే... స్ఫూర్తి మనదే

- మహిళా శక్తికి తిరుగులేదు మంత్రి డాక్టర్ సీతక్క
- స్త్రీశక్తి అవార్డుల ప్రదానోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు తలచుకుంటే అసాధ్యాలు కూడా సుసాధ్యాలవుతాయనీ, శక్తిమనదే..స్ఫూర్తి మనదే అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. అందుకు ఎందరో మహిళల విజయాలు కండ్ల ముందే నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ చాంబర్ ఆఫ్ ఇవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఇఐ) ఆధ్వర్యంలో ఏడో ఎడిషన్ స్త్రీ శక్తి అవార్డులను సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళ సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, 'ఇందిరా మహిళ శక్తి పథకం' గురించి వివరించారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామనీ, వడ్డీలేని రుణాలిస్తూ పారిశ్రామికవేత్తలుగా మారుస్తున్నామని తెలిపారు. మహిళలు దేశాలను ఏలుతున్నా కొందరి మైండ్ సెట్ మారడం లేదనీ, స్త్రీల ఎదుగుదలను గుర్తించడానికి నిరాకరిస్తున్నారని వాపోయారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక, పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ..స్త్రీ శక్తి అవార్డులు మహిళలు ఉన్నత స్థానాల్లోకి రావడానికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్ మాట్లాడుతూ..గ్రామీణ మహిళా ఉద్దీపనకర్తల గుర్తింపులో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందన్నారు. టీసీఇఐతో కలిసి సెర్ప్ ఆధ్వర్యంలో మహిళలకు ఈవెంట్ మేనేజర్లుగా శిక్షణివ్వడం ప్రారంభించామని తెలిపారు. టీసీఇఐ అధ్యక్షులు బలరాం బాబు, స్త్రీ శక్తి అవార్డుల కన్వీనర్, మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకులు విశాలరెడ్డి మాట్లాడుతూ..స్త్రీ శక్తి వేదిక మరింత విస్తరిస్తోందనీ, భవిష్యత్‌లో మహిళల పాత్రను మరింత విస్తృత పర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారి ప్రకాశ్‌రెడ్డి, టూరిజం శాఖ డైరెక్టర్, జడ్. హనుమంత్ కొండిబా, కింగ్‌డమ్ ఆఫ్ లెసోతో హానరరీ కాన్సుల్, సురత్ సింగ్ మల్హోత్రా, హెచ్‌వైఎస్ఇఎ అధ్యక్షుడు ప్రశాంత్ నాదెండ్ల, ఫిక్కీ చైర్‌పర్సన్ ప్రతిభా కుందా, యునైటెడ్ వే హైదరాబాద్ చైర్‌పర్సన్, బోర్డ్ మెంబర్ డాక్టర్ కిరణ్మయి, టీసీఈఐ అధ్యక్షులు బలరామ్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.రామ్, సంయుక్త కార్యదర్శి తౌఫిక్ మహమ్మద్, హర్షిత, సంగీతావర్మ, తదితరులు పాల్గొన్నారు.

**4 విభాగాల్లో 50 మంది అవార్డు గ్రహీతలు వీరే**

స్త్రీ శక్తి అవార్డు-2025 కోసం దేశవ్యాప్తంగా 250 మందికి పైగా మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. 50 మంది మహిళలు ఎంపికయ్యారు: అత్యున్నత గౌరవమైన స్త్రీ రత్న , స్త్రీ మూర్తి, స్త్రీ శక్తి, ప్రత్యేక మహిళా విభాగాల్లో అవార్డులు అందజేశారు. దేశవ్యాప్తంగా 15 ఏండ్లకుపైగా హాస్పిటాలిటీ, సృజనాత్మక కళలు, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో విశేష సేవలందించిన మహిళా ప్రముఖులు రాజనీ నాయర్ డెబ్, మాలిని దివాకల, పుష్ప భాస్కర్, వాణి తమ్మయగారి, మాలిని ఎల్. నరసింహన్‌లకు స్త్రీరత్న అవార్డులు వరించాయి.

## కెసిఆర్ నీది నోరా.. డ్రయినేజీనా.. : మంత్రి కోమటిరెడ్డి

- ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నల్లగొండలో ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్.. తెలంగాణ దేవత సోనియా గాంధీ అని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి హోదాలో చెప్పినది.. సోనియా గాంధీ ఇంటికి కుటుంబ సమేతంగా వెళ్లి కాళ్లు మొక్కిన విషయాన్ని మరిచిపోయావా? తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ నేడు విలన్ అయిందా?. అది నోరా.. డ్రయినేజీ మోరీనా.." అని రోడ్లు భవనాలు సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో రూ.20 కోట్ల 22 లక్షలతో నిర్మించనున్న బక్కతాయకుంట లిఫ్ట్ ఇరిగేషన్‌కు, రూ.6.8 కోట్లతో నిర్మించే పొనుగోడు ఎత్తిపోతల పథకానికి, ర.19.95 కోట్లతో నిర్మించనున్న నర్సింగ్‌బట్ల ఎత్తిపోతల పథకాలకు సోమవారం నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. 36 కోట్లతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్మించనున్న అదనపు బ్లాక్‌కు శంకుస్థాపన చేశారు. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. బిఆర్‌ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పది సంవత్సరాల్లో పది లక్షల కోట్లు సంపాదించావు.. సగం మంది జైల్లో ఉన్నారు.. సగం మంది అమెరికాలో ఉన్నారు.. కొంతమంది ఎక్కడున్నారో తెలియదు.. వాళ్లందరినీ పట్టుకోవాలంటే ఇంకా నాలుగు సంవత్సరాలు పడుతుంది" అని అన్నారు. అసెంబ్లీకి రావడం చేతకాని ప్రతిపక్ష నేత కేసీఆర్ సభలు పెట్టి కాంగ్రెస్‌ను విమర్శిస్తావా.? తన పాలన గురించి ప్రజలందరికీ తెలుసునన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు ఏనాడైనా ఒకటో తారీకు జీతం ఇచ్చిందా? కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు ఇస్తున్నామని, ఇంకా వారికి ఇవ్వాల్సిన బకాయిలు చాలా ఉన్నాయని తెలిపారు. 100 అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన కేసీఆర్ దళితున్ని ముఖ్యమంత్రి చేస్తానన్నావు, డబుల్ బెడ్ రూమ్ అన్నావు, కేజి టు పీజీ విద్య అన్నావ్ ఏదైనా అమలు జరిగిందా? అని ప్రశ్నించారు. తాము అబద్ధాలు చెప్పం చెప్పిందే చేస్తాం.. చేసేదే చెప్తాం.. సన్నబియ్యాన్ని పండించాలని రైతులకు సూచించాం.. కొనుగోలు చేశాం. అదనంగా 500 రూపాయలు బోనస్ కూడా ఇచ్చామని వివరించారు.

**ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**
**మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చేపట్టిన అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేసి సస్యశ్యామలం చేస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఇక్కడ ఎలాంటి ఇరిగేషన్ పనులు చేపట్టలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి రైతులు ఎదురుచూస్తున్న డిండి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ఎదుల ద్వారా నీరు అందించేందుకు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1800 కోట్లు మంజూరు చేసి పనులు మొదలు పెట్టామని చెప్పారు. అలాగే హై లెవెల్ కెనాల్‌కు రూ.442 కోట్లు మంజూరు చేశామని, పిల్లాయిపల్లి కాలువ, శివన్నగూడెం నుంచి నారాయణపూర్, చౌటుప్పల్ మీదుగా సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ తప్పనిసరిగా మంజూరు చేస్తామని ప్రకటించారు. మూసీని పునరుద్ధరించి ఉమ్మడి రైతులకు మేలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిలు కుందూరు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు నేతావత్ బాలూనాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జయవీర్‌రెడ్డి, డిసిసిబి అధ్యక్షులు కుంభం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్, ఇన్‌చార్జి రెవెన్యూ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్, ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్, ఉదయ సముద్రం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, జవహర్, ఇన్‌చార్జి డిఆర్ఓ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి వైస్ చైర్‌పర్సన్‌గా శాంతి కుమార్

- ఉత్తర్వులు జారీ చేసిన సిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎస్ పదవి నుంచి విరమణ తర్వాత శాంతి కుమారికి ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆమెను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి) వైస్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా, ఆమెకు ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ (డిజి)గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. సిఎస్‌గా ఈ నెల 30న ఆమె పదవీ విరమణ చేయనున్న సంగతి తెలిసిందే.

---

**మహారాజశ్రీ 3వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు : కాకినాడ**
**O.S.No. 83/2024**

Between :
**శ్రీ కె.వి.ఆర్.ఫోర్‌జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్,** వారి తరుపు ప్రతినిధి, డైరక్టర్ శ్రీమతి **బిక్కిన పద్మావతి** ...ప్లయింటిఫ్
మరియు
**వైబ్ర ఆటోమెట్ లిమిటెడ్,**
వారి తరుపు మేనేజింగ్ డైరక్టర్
సర్వే నెంబర్లు: 507 మరియు 508,
పడమటి సోమారామ్ రోడ్,
బిబీనగర్ -508126, నల్గొండ జిల్లా,
తెలంగాణ రాష్ట్రం. ... డిఫెన్‌డెంట్

పై దావాలో మీరు డిఫెన్‌డెంట్ అయ్యివున్నారు. పై దావాలో శ్రీ కోర్టు వారి నుండి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన దావా **ది. 20-06-2025 సం॥రం** తేదీన వాయిదా అయ్యివున్నది, కావున సదరు తేదిన **ఉదయం గం. 10-30 ని॥లకు** పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడుననియు ఇందుమూలముగా తెలియపరచడమైనది.

|| By Court Order ||
**కాకర వెంకటేశ్వరరావు,** అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

---

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE,PENUKONDA**
**O.S No:49/2008**

**Between:**
K.Pedda Nanjappa and others ...**Plaintiffs**
**And**
Reddipalli Sankara Reddy Since deceased represented by his L.Rs and others
...**Defendants**

**పై నెంబరు దావాలోని 40వ ప్రతివాదికి దావా సమన్లు**

**To,**
**D40**:Reddipalli Saroja Reddy W/o Reddipalli Sankara Reddy, D.No:16-11-405/28, Mushram Bagh, Hyderabad, Telangana State.

ఇందుమూలముగా నీకు తెలియజేయడం ఏమనగా పై దావాలోని వాదులు దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు డిక్లరేషన్‌కు మరియు పర్మనెంట్ ఇంజక్షన్‌కు గాను పై దావాను దాఖలు చేసినాడు. సదరి విషయముల్లై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల మీరు 05-05-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గాని లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ వాదనను కోర్టువారికి తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు పై దావాను తీర్మానము చేయుదురని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

**(By Order of the Court)**

**ఇట్లు,**
**సి.రామచంద్రా రెడ్డి,**
**వై.లక్ష్మినారాయణ,**
వాదులపరం వకీళ్ళు, పెనుకొండ

---

మహారాజశ్రీ అద్దంకి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
**O.S.No.123/2016**

ఆదెన వెంకట శేషమ్మ ...వాది
**Vs**
రాగినబోయిన సుబ్బులు (died) & ఇతరులు ...ప్రతివాదులు

ప్రకటన

**To:**
**D-6**
పుల్లెల ప్రమోద్ కుమార్ S/o. ఆదిశేఖర్,
ప్రవేట్ ఎంప్లాయి,
R/o. హౌస్ No: 7-1-70/B/1, అమీర్ పేట్,
హైదరాబాద్, తెలంగాణా.

పై దావా లో మీకు ఎన్నిసార్లు దావా సమన్లు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు పై నంబరు దావా లో నోటీసును ఈ ప్రకటన ద్వారా. కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావా ను తేది. 05-05-2025 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం ॥ 10-30 ని॥లకు పై కోర్టువారి ఏదుట స్వయముగా గానీ, వకీలు ద్వారాగానీ హాజరయి పై దావాలో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఏడల పై దావాను మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //
వజ్రాల అంజిరెడ్డి,
బి.యస్.సి., బి.యల్.,
వాది తరుపు న్యాయవాది,

---

**ఫారం సి**
**బహిరంగ ప్రకటన**
(ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ రూల్స్ 2019 లోని (కార్పొరేట్ రుణగ్రహీతలకు వ్యక్తిగత హామీదారుల దివాల ప్రక్రియ కోసం న్యాయ నిర్ణేతకు దరఖాస్తు) రూల్ 9(1) క్రింద)
**మెస్సర్స్ టర్బో మెషినరీ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్** యొక్క వ్యక్తిగత హామీదారు
**శ్రీ తోట చంద్రకాంత్** యొక్క రుణదాతలకు గమనిక

ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ వారు కోడ్ యొక్క సెక్షన్ 60 క్రింద దివాలా ప్రక్రియ విషయంలో **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** వారిచే IBC, 2016 యొక్క సెక్షన్ 121 క్రింద దాఖలు చేయబడిన CP (IB) No. 285/95/HDB/2021 లో ఇచ్చిన తీర్పు ప్రకారము హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న **శ్రీ తోట చంద్రకాంత్** పై దివాలా ప్రక్రియ ప్రారంభించుటకు **24.04.2025** తేదీన ఉత్తర్వు జారీ చేయడమైనది.
**శ్రీ తోట చంద్రకాంత్** యొక్క రుణదాతలను **05.05.2025 న** లేదా ఆలోగా తగిన రుజువుతో వారి క్లైములను బ్యాంక్రప్టసీ ట్రస్టీకు ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాధాపూర్, హైదరాబాద్- 500033, తెలంగాణ వద్ద సమర్పించాలని ఇందుమూలముగా కోరుతున్నాము.
రుణదాతల క్లెయిమ్‌ల సమర్పణకు చివరి **తేది: 05.05.2025.** రుణదాతలు స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్ లేదా ఎలక్ట్రానిక్ విధానముల ద్వారా దాఖలు చేయవచ్చును.

| క్రసం. | దివాలా తీసిన శ్రీ తోట చంద్రకాంత్ యొక్క వివరములు | |
|---|---|---|
| 1. | దివాలాదారు పేరు | శ్రీ తోట చంద్రకాంత్ |
| 2. | దివాలాదారు చిరునామా | తండ్రి టి. స్బురాయుడు, నివాసం: ప్లాట్ నెం. 296, రోడ్ నెం. 25, సిసికె ఛాంబర్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033 ఇంకొక చిరునామా ఇం.నెం. 22, లుంబిని ఎస్ఎల్ఎన్ స్ప్రింగ్స్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ-500032. |
| 3. | దివాలా ప్రక్రియ ప్రారంభ తేది | 24.04.2025 |
| 4. | క్లైముల దాఖలు కొరకు ఆఖరు తేది | 05.05.2025 (పబ్లిక్ నోటీసు తేది నుండి 7 రోజులు) |
| | **బ్యాంక్రప్టసీ ట్రస్టీ వివరములు** | |
| 6. | బ్యాంక్రప్టసీ ట్రస్టీగా వ్యవహరిస్తున్న తీర్మాణ నిపుణుల పేరు మరియు రిజిస్ట్రేషన్ నెం. | **పేరు: కాశి శ్రీనివాస్** రిజిస్ట్రేషన్ నెం. IBBI/IPA-003/IPA-ICAI-N-00237/2019-2020/12840 |
| 7. | బోర్డు వద్ద నమోదైన బ్యాంక్రప్టసీ ట్రస్టీ యొక్క చిరునామా మరియు ఇ-మెయిల్ | 1-2-37/4బి, ఫ్లాట్ నెం. 4బి, జైన్స్ భవాని రెసిడన్సీ, స్ట్రీట్ నెం. 3, కాకతీయ నగర్, హబ్సిగూడ, హైదరాబాద్-50007. ఇ-మెయిల్: Srinivaskashyap111080@gmai.com |
| 8. | బ్యాంక్రప్టసీ ట్రస్టీతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుటకు ఉపయోగించే చిరునామా మరియు ఇ-మెయిల్ | ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరిహిల్స్, మాధాపూర్, హైదరాబాద్-500033, తెలంగాణ. ఇ-మెయిల్: pg.turbomachinery@gmail.com |

**గమనిక:** రుజువుతో తప్పుడు లేదా తప్పుద్రోవ పట్టించే క్లైముల దాఖలుపై, ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు ఏదేని వర్తించు ఇతర చట్టంలోని నిబంధనలను అనుసరించి జరిమాన విధించబడును.

కాశి శ్రీనివాస్
బ్యాంక్రప్టసీ ట్రస్టీ

తేది: **29.04.2025**
ప్రదేశం: హైదరాబాద్
**IBBI/IPA-003/IPA-ICAI-N-00237/2019-2020/12840**
**AFA 31.12.2025** వరకు చెల్లుతుంది

# బిఆర్ఎస్.. కాళేశ్వరం దోషి!

- ఎన్‌డిఎస్ఎ నివేదిక ఆధారంగా వ్యూహం
- ఘోష్ కమిషన్ రిపోర్టు కోసం ఎదురుచూపులు
- గులాబీ నేతలపై త్వరలోనే కొరడా?

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కుంగుబాటు వ్యవహారంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సర్కారు ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నది. ఇటీవల ఎన్‌డిఎస్ఎ తుది నివేదిక రావడం, అందులో గత బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సర్కారు తప్పిదాలను ఎత్తిచూపడంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉత్సాహం పెరిగింది. కాళేశ్వరం వాస్తవాల ఆధారంగా బిఆర్ఎస్‌ను ప్రజల్లో దోషిగా నిలబెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ. లక్ష కోట్లు ఖర్చుపెట్టినా లక్ష ఎకరాలకు సాగునీళ్లు ఇవ్వలేకపోయారనీ, కనీసం ఇంకా రూ. 42 వేల కోట్లు వ్యయం చేస్తే తప్ప ప్రాజెక్టు పూర్తయినట్టు కాదని 'కాగ్' నివేదిక రెండేళ్ల కిందే చెప్పింది. దీనితో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కుంగుబాటు బీఆర్ఎస్‌కు శాపంగా పరిణమించింది. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి రాదని ఎన్‌డిఎస్ఎ సైతం స్పష్టం చేసింది. ఏడో బ్లాక్‌ను పూర్తిగా తొలగించినా, ప్రాజెక్టు వరదలను తట్టుకుందటుందనే గ్యారంటీలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కారులో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

**ఘోష్ నివేదిక కోసం**

జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలనే తలంపు ఇటు సిఎం రేవంత్‌తోపాటు ఎఐసిసి పెద్దల్లోనూ ఉన్నట్టు కనిపిస్తున్నది. అల్లాటప్పా అరోపణలు, విమర్శలతో కేసులు పెట్టి తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి అయిన కెసిఆర్‌ను అరెస్ట్ చేస్తే పరువుపోవడం మినహా ఫలితం ఉండదని గాంధీభవన్ వర్గాల్లో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. గాలికి కెసిఆర్ బృందంపై చర్యలు తీసుకునే ఆలోచన లేదని సిఎం రేవంత్ సోమవారం మీడియా చిట్‌చాట్‌లో వ్యాఖ్యానించారు. దీనిబట్టి పక్కా సాక్ష్యాధారాలతో కేసుపెడితే నిలిచేలా ప్రత్యేక వ్యూహాన్ని ఆచరించాలని భావిస్తున్నారు. అందులో భాగంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చురుగ్గా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.

**తప్పిదాలను ఎత్తిచూపుతూ..**

నీటిపారుదల రంగంలో బిఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన తప్పులను ఎప్పటికప్పుడు మీడియాకు చెప్పడంలో మంత్రి ఉత్తమ్ చొరవ చూపిస్తున్నారు. అలాగే మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, సీతక్క తదితరులు సైతం కెసిఆర్, హరీశ్‌రావును టార్గెట్ చేస్తూనే ఉన్నారు. సాగునీటి పారుదల శాఖలో నియామకాలు ఇష్టారాజ్యంగా చేశారనీ, మాట వినేవారికే ఉన్నతస్థాయి పోస్టులు కట్టబెట్టి తాము చెప్పిందే వేదంలా అమలుచేశారనే ప్రచారం ఉన్న సంగతి తెలిసిందే. ఎవరైనా అధికారి తొకజాడిస్తే వెంటనే పోస్టుల నుంచి తప్పించడం, అప్రాధాన్యత బాధ్యతల్లో పెట్టడం చేశారని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఆయా పోస్టుల్లో రిటైరైనా ఒకటికి నాలుగుసార్లు ఎక్స్‌టెన్షన్లు ఇచ్చి పరిపాలన సాగించారని మంత్రులు తరచూ విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. మాజీ ఈఎన్సీ మురళీధర్ ఇంజినీరింగ్ నియమాల ప్రకారం కాకుండా మాజీ సీఎం కేసీఆర్ అభీష్టం మేరకు ప్రాజెక్టు డిజైన్లు రూపొందించారనీ, ఇందులో కింది స్థాయి అధికారులతోపాటు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ పాత్ర కూడా ఉందని నీటిపారుదల శాఖ ఫైళ్లు చెబుతున్నాయి. ఈ విషయాలను విజిలెన్స్‌తోపాటు ఎన్డీఎస్ఏ ధృవీకరించాయి. జస్టిస్ ఘోష్ విచారణ సందర్భంగా కూడా మాజీ సిఎం కెసిఆర్ సూచన మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాము డిజైన్లు, డ్రాయింగ్‌లు, ఇతర వ్యవహారాలు చేసినట్టు వాంగ్మూలం ఇచ్చే క్రమంలో చెప్పారు. అడ్డగోలు డిజైన్లతోపాటు ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని సైతం మార్చారని ఘోష్ కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్లల్లో పేర్కొన్నారు. ఇందులో సిఎంఒ స్థాయి అధికాలు, నీటిపారుదల శాఖలోని ముఖ్య అధికారుల పాత్ర సైతం ఉందని సమాచారం.

**ఎసిబి కేసు**

తాజాగా ఎన్‌డిఎస్ఎ నివేదిక ఆధారంగా ఏసీబీ సైతం చురుగ్గా చర్యలు చేపడుతున్నది. ఇఎన్‌సి హరిరాంపై కేసు నమోదు చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసు అందులో భాగమే. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థల నుంచి అడ్డగోలుగా నిధులు లంచాల రూపంలో పుచ్చుకున్నారనే ఆరోపణలు, విమర్శలు గతం నుంచే ఉన్నాయి. హరిరాం దాదాపు రూ. 200 కోట్లకుపైగా ఆస్తులను కూడబెట్టారని ఏసీబీ వర్గాలు భావిస్తున్నాయి. మూడు బ్యారేజీలు వినియోగించలేమని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది. ఈనేపథ్యంలో ఆ నివేదకలోని అంశాలను మంగళవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా మీడియాకు చెప్పనున్నారు. తద్వారా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను రాజకీయంగా దెబ్బకొట్టాలనే భావనతో సిఎం రేవంత్ ఉన్నట్టు గాంధీభవన్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా కాంగ్రెస్ సర్కారు వ్యూహానికి చెక్ పెట్టేందుకు రజతోత్సవ వేడుకల పేరుతో వరంగల్ సభను కెసిఆర్ తలపెట్టినట్టు తెలిసింది. ఉద్యమంలో తాను ఒక్కడినే బయలుదేరి తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టానని సభలో కెసిఆర్ చెప్పారు. పాత విషయాలను తవ్వడం ద్వారా తానేంటో ప్రజలకు, ప్రభుత్వానికి చెప్పే ప్రయత్నం చేశారని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## అబద్ధాలకు పెద్ద కొడుకు కెసిఆర్

- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

అబద్ధాలకు పెద్ద కొడుకు మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. భ్రమల నుంచి బయటపడాలని కెసిఆర్‌కు ఆయన సూచించారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభను అబద్ధాలు ప్రచారం చేసేందుకే పెట్టారని ఆరోపించారు. చంద్రబాబు తెలంగాణ పదాన్ని నిషేధించారంటూ సెంటిమెంట్‌ను తీసుకొచ్చే ప్రయత్నం చేసిన కెసిఆర్, తన పార్టీ పేరులో తెలంగాణను ఎందుకు నిషేధించారని ప్రశ్నించారు.

## ఎసిబికి చిక్కిన శామీర్‌పేట్ ఎస్ఐ

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్ ఎస్ఐ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఎసిబికి చిక్కాడు. ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 20న శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో ఓ చీటింగ్ కేసు నుంచి ఇద్దరిని తప్పించేందుకు ఎస్ఐ పరశురామ్ నాయక్ రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు. ఈ మేరకు 21న రూ.2 లక్షల లంచం ఎస్ఐకి కారులో బాధితులు ఇచ్చారు. మళ్లీ ఫోన్ చేసి అదనంగా రూ.25 వేలు కావాలని డిమాండ్ చేయగా బాధితులు రూ.22 వేలు ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం వారు ఈనెల 23న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రూ.22 వేలు పోలీస్ స్టేషన్‌లోని చెత్త బుట్టలో వేసి వెళ్లిపోవాలని ఎస్ఐ సూచించాడు. ఎస్ఐ చెప్పినట్టు బాధితుడు రూ.22 వేలు చెత్త బుట్టలో వేసి వెళ్లిపోగా, ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్ 2 అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా ఎస్ఐను పట్టుకున్నారు ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా లేదా వాట్సాప్ నెంబర్ 9440446106కు సమాచారం అందించాలని ఏసీబీ అధికారులు తెలిపారు.

# కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

- కలెక్టరేట్ వద్ద ధర్నాలో పైళ్ల ఆశయ్య
- కలెక్టర్‌కు వినతిపత్రం

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం మంగేనపల్లికి చెందిన ఆదివాసీ కన్నయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య అన్నారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కుమార్ దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెత్తందారుల వేధింపులతో నాయిని కన్నయ్య ఆత్మహత్య చేసుకుని 25 రోజులైనా అధికారులు, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కన్నయ్య మరణానికి కారకులైన ఎనగంటి చిన్నన్నతోపాటు ఆయన భార్య, అక్రమంగా భూమి పట్టా చేసుకున్న ఎనగంటి హరీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చర్య తీసుకోవాలని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య డిసిపి భాస్కర్, కలెక్టర్‌ను ఆదేశించినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని అన్నారు. దీన్ని బట్టి చూస్తే జిల్లా యంత్రాంగం పెత్తందారుల కనుసన్నల్లో పని చేస్తోందని అర్థమవుతోందన్నారు. టీఏజీఎస్(తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ మాట్లాడుతూ.. కనీసం ట్రైబల్ డిపార్ట్‌మెంట్ అధికారులు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ ప్రాణాలతో చెలగాటమాడుతున్న పెత్తందారులను కఠినంగా శిక్షించి, ఆదివాసులకు రక్షణ కల్పించినప్పుడే వారు స్వేచ్ఛగా బతుకుతారన్నారు. అధికారులు వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని కోరారు. కన్నయ్య కుటుంబానికి చెందిన ఎకరం భూమికి లావుని పట్టా చేయించుకున్న ఎనగంటి హరీష్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా లావుని పట్టా చేసిన అప్పటి తహసీల్దార్, ఆర్ఐపై కూడా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కన్నయ్య కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగాల రాజన్న, ఎర్మ పున్నం, బాధితులు నాయిని స్వరూప, టీఏజీఎస్ జిల్లా నాయకులు మర్మల మల్లీశ్వరి, శంకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బోడంకి చందు, అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు గోమాస రాజబాబు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేష్, ప్రేమ్‌కుమార్, శ్రామిక మహిళా సంఘం నాయకులు దాసరి రాజేశ్వరి, ఐద్వా జిల్లా కార్యదర్శి సామల ఉమారాణి, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## గిరిజన కళలపై వేసవి శిబిరం

- కార్యదర్శి డాక్టర్ శరత్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

గిరిజన కళలపై వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ ఎ శరత్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని మాసాబ్ ట్యాంక్ లో ఉన్న గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థలో గిరిజన కళలపై పాఠశాల విద్యార్థుల కోసం వేసవి శిబిరం ప్రారంభమైంది. వచ్చే నెల 7 వరకు కొనసాగనున్న ఆ శిబిరాన్ని గిరిజన గురుకుల సంస్థల కార్యదర్శి సీతాలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ... వేసవి కాలంలో ఇంట్లో ఉంటూ సెల్ ఫోన్లు వాడుతూ ఉండడం వల్ల ఆరోగ్యం, మనసు రెండూ చెడిపోతాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ ప్రాంతవాసులకు కూడా అందుబాటులోకొచ్చిన గిరిజన కళా వేసవి శిబిరాన్ని అరుదైన అవకాశంగా తీసుకుని గిరిజన కళలు, సంస్కృతిపై అవగాహన, సాధికారత పెంచుకోవాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ... తెలంగాణ ఏర్పడ్డ తర్వాతనే తెలంగాణ గిరిజన కళలను అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సహకార సంస్థ జనరల్ మేనేజర్ సీతారామ్, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ వి. సముజ్వల,డి సత్యనారాయణ, హేమలత, ఆర్గనైజర్లు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్లో దారుణ హత్య

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో పట్టపగలే దారుణ హత్య జరిగింది. కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామానికి చెందిన పొలం కుమార్ (40)ను ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన వేల్పుల సంతోష్ కత్తితో మెడపై పొడిచి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. నిందితుడితో పాటు ఓ మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని భావిస్తున్నారు.

## తెలంగాణ విధ్వంసంలో విలన్ బిఆర్ఎస్

- కెసిఆర్‌తో రేవంత్ ఫైటింగ్ డూపే : మహేశ్వర్‌రెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ విధ్వంసంలో విలన్ బిఆర్ఎస్ పార్టీ అని బిజెపి ఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. 11 ఏళ్లలో తెలంగాణకు నిధులివ్వలేని కేసీఆర్ మాట్లాడటం సరిగాదన్నారు. మోడీ సర్కార్ తెలంగాణకు 11 లక్షల కోట్ల రూపాయలను ఇచ్చిందన్నారు. కేంద్రం నిధులపై చర్చించేందుకు ఆయన సిద్ధమేనా? అని సవాల్ విసిరారు. కెసిఆర్ స్పీచ్ కొండంత రాగం తీసి దిక్కు మాలిన పాట పాడినట్టుగా ఉందనీ, బీఆర్ఎస్ సభ అట్టర్‌ప్లాప్ అయిందని దెప్పిపొడిచారు. కెసిఆర్ మాటల్ని తెలంగాణ ప్రజలు నమ్మేస్థితిలో లేరని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం పేరుతో ఆర్థిక విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ఆది ఎత్తిపోతల ప్రాజెక్ట్ కాదు తిప్పి పోతల ప్రాజెక్ట్ అని విమర్శించారు. ఎన్‌డిఎస్ఎ రిపోర్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. కెసిఆర్ ప్రభుత్వం హయాంలో జరిగిన అక్రమాలపై ఆయన కుటుంబాన్ని వెయ్యి ఏండ్లు జైళ్లో పెడతానన్నావ్ కదా రేవంత్‌రెడ్డీ..ఏమైంది అని ప్రశ్నించారు. కెసిఆర్‌ను కాపాడుతున్నది రేవంత్‌రెడ్డి సర్కారే అనీ, లేకుంటే ఆయన ఎప్పుడో అరెస్టు అయ్యేవారని తెలిపారు. అందుకే ఐదేళ్లు రేవంత్‌రెడ్డి సర్కారే ఉండాలని కెసిఆర్ కోరుకుంటున్నారని విమర్శించారు. కెసిఆర్, రేవంత్‌రెడ్డిలది డూప్ ఫైటింగ్ అన్నారు. కెసిఆర్ అక్రమాలపై విచారణను సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

# నకిలీ పత్రాలతో నివాసం..

- బంగ్లాదేశ్ యువకుడి అరెస్ట్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

నకిలీ పత్రాలు సృష్టించి ఇక్కడ నివాసముంటున్న బంగ్లాదేశ్‌కు చెందిన యువకుడిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని పోచారం ఐటీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌కు చెందిన ఎండీ రషల్ షేక్ ఘట్కేసర్ మండలం చౌదరిగుడాలోని వెంకటసాయి ప్రేమ్ నగర్‌లో ప్లాట్ నెం.-36లో అక్రమంగా నివాసం ఉంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివకృష్ణ సిబ్బందితో కలిసి సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్లు, ఆధార్ కార్డు, ఓటర్, కార్డు పాన్ కార్డు, కోవిడ్ - 19 టీకా వేసుకున్న ధ్రువపత్రం, బంగ్లాదేశ్‌కు చెందిన ఓటర్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. రషల్ స్థానికంగా ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్టు గుర్తించారు. నిందితుడిపై ఫారినర్స్ యాక్ట్ కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

# డాక్టర్ అన్నప్రసన్నకు బెదిరింపులు

- చర్యలకు డిఎంహెచ్‌ఓస్ అసోసియేషన్ డిమాండ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పెద్దపల్లి డిఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నప్రసన్నతో స్కాన్ సెంటర్‌లో అక్కడి వైద్యులు, మాజీ కార్పొరేటర్లు తప్పుగా ప్రవర్తించి బెదిరించడాన్ని డిఎంహెచ్‌ఓస్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధాకర్ లాల్, కోశాధికారి డాక్టర్ అప్పయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ అన్నప్రసన్న జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఆ ఆస్పత్రికి తనిఖీకి వెళ్లిందని తెలిపారు. ఆమె విధులు నిర్వహిస్తున్న సమయంలో సదరు ఆస్పత్రి నిర్వాహకులు సహకరించాల్సిందని అభిప్రాయపడ్డారు. అలాకాకుండా ఆమెను బెదిరించడం, ఆమెపైనే పోలీసుల వద్ద కేసు నమోదు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుని పరిస్థితిని సానుకూలపరచాలని ఉన్నతాధికారులను కోరారు.

# తెలంగాణకు అసలు విలన్ కెసిఆర్

- ఎక్కడైనా.. ఎప్పుడైనా చర్చకు సిద్ధం
- బిఆర్ఎస్ పదేళ్లలో చేసిందేమీ లేదు : మహేశ్ కుమార్ గౌడ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అసలు విలన్ కెసిఆర్ అని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో చేసిందేమి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలన ప్రజాపాలన అని కొనియాడారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ అట్టర్ ప్లాఫ్ అయిందనీ, జనాల కంటే విస్కీ బాటిళ్లే ఎక్కువగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. సభలో మహిళలే కనిపించలేదన్నారు. దేశం కోసం ఆస్తులు, ప్రాణాలు త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని నకిలీ గాంధీలు అనడం కెసిఆర్ దుస్సాహసానికి పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తం చేసారు. దీనికి కెసిఆర్ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బిజెపి, బిఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాయనీ, అందుకే కేవలం రెండు నిమిషాలు నెమలి పిచ్చంతో కొట్టినట్టు బిజెపిపై కెసిఆర్ విమర్శలు చేసి వదిలేశారని తెలిపారు.

బిసి కులగణన, ఎస్‌సి వర్గీకరణ, వక్ఫ్ చట్టంపై కేసిఆర్ ఎందుకు నోరు మెదపలేదని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బిజెపి, బిఆర్ఎస్ కుట్ర పన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. దొంగ పాస్ పోర్టుల బిజినెస్ చేసుకునే మీ కుటుంబం లక్షల కోట్లకు పడగలెత్తిన కెసిఆర్‌కు తిన్నింటి వాసాలు లెక్కపెట్టడం కేసిఆర్‌కి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. పదేళ్లలో బిఆర్ఎస్ 60 వేల ఉద్యోగాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు.

కుటుంబంలో కొట్లాటతో వేగలేక కెసిఆర్ రజతోత్సవ సభ పేరుతో హంగామా చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత ఆడుతున్న మూడు ముక్కలాటతో కేసిఆర్‌కి మతి భ్రమించిందన్నారు. వేదికపై కెసిఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలు చూసి కవిత మనసు గాయమైందన్నారు. కవితతో పాటు హరీశ్‌రావు పరిస్థితి అర్థం కాకుండా తయారైందని చెప్పారు. తెలంగాణ రాజకీయాల్లో కెసిఆర్ శకం ముగిసిందనీ, ఆయన్ను ప్రజలు ఎప్పటికీ క్షమించరన్నారు. పదేళ్ల పాలనలో కెసిఆర్ కుటుంబం దోపిడీకి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. దేశ చరిత్రలో అతి తక్కువ కాలంలో ఎక్కువ దోచుకున్న కుటుంబం కేసిఆర్ కుటుంబమన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన, ఎస్‌సి వర్గీకరణ, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు, సన్న బియ్యం పంపిణీనీ అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అస్థిత్వం కోల్పోయిన కెసిఆర్ బిజెపికి సాగిలపడి రాష్ట్రానికి తీరని అన్యాయాలు చేశారని ఆరోపించారు. దళిత సీఎం, ఇంటింటికి ఉద్యోగం, గిరిజనులకు, ముస్లింలకు రిజర్వేషన్ల పెంపు, అమరవీరులకు ఉద్యోగాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లు అంటూ బిఆర్ఎస్ భూముల ధరలు పెంచి తమ కుటుంబాన్ని బాగు చేసుకున్నారని తెలిపారు.

## ఉద్రిక్త వేళలోనూ కొనుగోళ్లు

- సెన్సెక్స్ 1000 పాయింట్ల ర్యాలీ

**ముంబయి :** భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల సమయంలోనూ మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1006 పాయింట్లు లేదా 1.27 శాతం పెరిగి 80,218.37కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 289 పాయింట్లు లేదా 1.40 శాతం లాభపడి 24,328 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30 సూచీల్లో 23 లాభాలను నమోదు చేశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సూచీ అత్యధికంగా 5.27 శాతం పెరిగింది. గత కొన్ని రోజులుగా విదేశీ సంస్థాగత మదుపర్లు భారత ఈక్విటీల్లో కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇది మార్కెట్‌లో విశ్వాసాన్ని బలోపేతం చేసింది. టారిఫ్‌ల విషయంలో అమెరికా-చైనాల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరొచ్చన్న సంకేతాలు కూడా అంతర్జాతీయ మార్కెట్లతో పాటు భారత మార్కెట్లూ రాణించడానికి కారణమని నిపుణులు భావిస్తున్నారు.

సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, ఎస్‌బిఐ, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 66 డాలర్లుగా నమోదయ్యింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి బ్యాంకింగ్ రంగ షేర్లు రాణించిన వాటిలో ఉన్నాయి. మార్కెట్లు రాణిస్తున్నప్పటికీ.. భౌగోళిక ఉద్రిక్తతలను కొనసాగుతున్న వేళ రిటైల్ మదుపర్లు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఐపిఒ కోసం కెనరా రోబెకో ఎఎంసి దరఖాస్తు

**ముంబయి :** కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు రానుంది. ఇందుకోసం ప్రతిపాదిత పత్రాలను సెబీకి సమర్పించింది. ఐపిఒ ప్రతిపాదిత పత్రాల ప్రకారం.. ఆఫర్ ఫర్ సేల్‌లో ప్రమోటర్లు తమ 4.98 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. అదే విధంగా ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ 2.59 కోట్ల షేర్లను, ఓరిక్స్ కార్పొరేషన్ 2.39 కోట్ల షేర్ల చొప్పున ఉపసంహరించుకోనుంది. 2024 డిసెంబర్ నాటికి ఈ సంస్థ 25 స్కీమ్‌లను కలిగి ఉంది. రూ.1,08,366 కోట్ల ఎయుఎం కలిగి ఉంది. ఈ ఇష్యూ ద్వారా రూ.800-100 కోట్ల నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## స్ట్రింగ్ మేటావర్స్ రైట్ ఇష్యూకు విశేష స్పందన

**ముంబయి :** టెక్ కంపెనీ స్ట్రింగ్ మెటావర్స్ లిమిటెడ్ రైట్ ఇష్యూకు విశేష స్పందన లభించింది. విజయవంతంగా తమ రైట్ ఇష్యూను ముగించినట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఈ ఇష్యూలో పబ్లిక్ ఇన్వెస్టర్ల నుంచి రూ.49.25 కోట్ల నిధులు సమీకరించినట్లు తెలిపింది. దీంతో 94,71,445 షేర్లను జారీ చేయడం ద్వారా తమ సంస్థలో పబ్లిక్ షేర్‌హోల్డింగ్ 19 శాతానికి పెరిగిందని పేర్కొంది. తమ రైట్ ఇష్యూకు రూ.100 కోట్ల ఓవర్‌సబ్‌స్క్రైబ్ లభించిందని తెలిపింది.

## ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌కు రూ.304 కోట్ల లాభాలు

**న్యూఢిల్లీ :** గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ 58 శాతం తగ్గుదలతో రూ.304 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ4లో రూ.724 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.9,861 కోట్లుగా ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ4లో రూ.11,308 కోట్లకు పెరిగింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.88 శాతం నుంచి 1.87 శాతానికి, నికర ఎన్‌పిఎలు 0.60 శాతం నుంచి 0.53 శాతానికి తగ్గాయి.

## ఎపి, టిజిల్లో జియో ఎయిర్ ఫైబర్‌కు అత్యధిక వాటా

**హైదరాబాద్ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో జియో ఎయిర్ ఫైబర్ సేవల ద్వారా 5జి ఫిక్స్ డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యుఎ) విభాగంలో తన ఆధిపత్యాన్ని మరింత బల పరుచుకున్నట్లు రిలయన్స్ జియో తెలిపింది. ట్రాయ్ ఫిబ్రవరి 2025కి విడుదల చేసిన గణంకాల ప్రకారం.. తమ సంస్థ తెలుగు రాష్ట్రాల్లో 5జి ఎఫ్‌డబ్ల్యుఎలో 84 శాతం వాటాను పొందినట్లు పేర్కొంది. ఇక్కడ తమకు 4,27,439 యాక్టివ్ చందాదారులున్నారని తెలిపింది.




## 2025 బివైడి సీల్ ధర రూ.41 లక్షలు

**న్యూఢిల్లీ:** గ్లోబల్ విద్యుత్ కార్ల తయారీ కంపెనీ బివైడి తన 2025 బివైడి సీల్ లగ్జరీ కార్ ధరలను ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. భారత్‌లో బివైడి డైనమిక్ వేరియంట్‌లో 61.44 కిలోవాట్ బ్యాటరీ కేపాసిటీ మోడల్ ఎక్స్‌షోరూం ధరను రూ.41 లక్షలుగా, ప్రీమియం వేరియంట్ 82.56కెడబ్ల్యూహెచ్ ధరను రూ.45.70 లక్షలుగా, పర్ఫమెన్స్‌మోడల్ 82.56కెడబ్లుహెచ్ ధరను రూ.53.15 లక్షలుగా నిర్ణయించినట్లు వెల్లడించింది. దేశంలో ప్రస్తుతం ఈ సంస్థకు 40 అవుట్‌లెట్‌లున్నాయి.

## యూట్యూబ్ ఇండియా నూతన ఎండిగా గుంజన్ సోనీ

**న్యూఢిల్లీ :** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ దిగ్గజం యూట్యూబ్ తన ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌గా గుంజన్ సోనీని నియమించింది. బిజినెస్, టెక్నాలజీ, మార్కెటింగ్, ఇ-కామర్స్ రంగాల్లో రెండు దశాబ్దాలకుపైగా గుంజన్‌కు అనుభవం ఉంది. తను ఇకపై భారత్‌లో యూట్యూబ్ వృద్ధి, ఆవిష్కరణ ప్రయత్నాలకు బాధ్యత వహించబోతున్నట్లుగా ఆల్ఫాబెట్ యాజమాన్యం వెల్లడించింది. భారత్‌లో యూట్యూబ్ ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా సాగుతోందని యూట్యూబ్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద పేర్కొన్నారు. అపారమైన అనుభవం ఉన్న గుంజన్‌కు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.